# మా నాన్న నేను



# మా అబ్బాయి

కల్లూరి భాస్కరం

కథ

'మావయ్యా, నువ్వు గుండు చేయించుకొంటే అచ్చం తాతయ్యలానే ఉన్నావు' అన్నాడు నా మేనల్లుడు. మొదటిసారి తనే ఆ విషయం కనిపెట్టానన్న మెరుపు వాడి కళ్ళల్లో.

'అవునా' అనుకొంటూ అద్దం ముందు నిలబడ్డాను.

నా మొహంలో నాన్న మొహాన్ని ఊహించుకోడానికి ప్రయత్నించాను. క్షణకాలం అవునేమో అనిపించింది. మరుక్షణం కాదేమోననిపించింది. అయినా మన పోలికల్ని ఇంకొకళ్ళు చూసి చెప్పాలి గానీ, మనంతట మనం తెలుసుకోలేమనుకున్నాను.

నేను నాన్నలా మారుతున్నానా!

మేము అప్పుడే తిరుపతి వెళ్ళొచ్చాం.

మా మేనల్లుడు అలా అన్న మూడు నాలుగు రోజులకు ఆ ఏడాది మా యింట్లో జరిగిన నాన్నగారి ఆబ్దికానికి నా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు అంతా వచ్చారు.

'ఒరేయ్... నిన్ను చూస్తుంటే నాన్నను చూస్తున్నట్టే ఉందిరా' అంది మా అక్కయ్య.

నేను ఉలిక్కిపడ్డాను.

'అవునవును...' అంటూ మా బావ వంత పాడాడు.

'వాడివన్నీ నాన్న పోలికలే' అన్నాడు మా అన్నయ్య

నిజంగానే నాన్నలా మారిపోయానా!? నేను ఆలోచనలో పడ్డాను.

కొన్ని అలవాట్లను, ప్రవర్తనను చూపించి నాది నాన్న పోలిక అని మా అమ్మ కూడా అంటుండేది. మా ఆవిడ కొన్ని సందర్భాల్లో 'మీ నాన్నగారి పోలిక మీకొచ్చింది బాబూ, మీ అన్నదమ్ములెవరికీ రాలేదు' అంటూ విసుక్కొంటూ ఉంటుంది. ముఖ్యంగా భోజనం దగ్గర. మా నాన్న గొప్ప తిండిపుష్టి ఉన్న మనిషేమీ కాదు. కానీ ప్రతిపూట నెయ్యితో సహా భోజనంలో అన్నీ ఉండాలి. అవి రుచికరంగా ఉండాలి. మా యింట్లో మళ్ళీ ఈ పోలిక నాకే వచ్చిందనుకొంటాను. ఇటువంటి పోలికలు కొత్త కాకపోయినా గుండు చేయించుకొన్నప్పుడు రూపంలో కూడా నాన్న పోలికేననడం నాకు కొత్తగా ఉంది. విచిత్రంగా ఉంది.

ఇప్పటి నా వయస్సులో నాన్న ఎలా ఉండేవారో ఊహించుకొనే ప్రయత్నం చేశాను. నాన్న ఎప్పుడూ గుండుతోనే ఉండేవారు. పిలక కూడా ఉండేది. పంచె, లాల్చీ ధరించేవారు. కండువా వేసుకొనేవారు. బయట కెళ్ళినప్పుడు చేతిలో సంచీ ఉండేది. ఆయన బయటికి వెడుతున్నప్పుడు, ఇంటికి వస్తున్నప్పుడు మోచేతికింద సంచీని వ్రేలాడదీసుకొని పంచె కొంగును ఒకింత పైకి పట్టుకొని, కింది పెదవిని సగం పైపళ్ళతో నొక్కి పరిసరాలు పట్టనివాడిలా ఏవో ఆలోచనలు చేస్తూ చలువకుండలా నడిచొస్తూ కనిపించేవారు.

నేను కూడా అలాగే గుండుతో, పిలకతో లాల్చీ, పంచె ధరిస్తే నాన్నలానే ఉంటానేమో! నాలా షర్టు, ప్యాంటు ధరిస్తే నాన్న నాలానే ఉండేవారేమో!

నేను నాన్నలా అయిపోవడం నాలో చాలా ఆలోచనలు రేపింది. నిజానికి నాన్న ప్రభావాల నుంచి, నమ్మకాల నుంచి బయటపడడం ఒకప్పుడు నా జీవితలక్ష్యంగా ఉండేది. నాన్న ప్రపంచం వేరు, నా ప్రపంచం వేరు అనుకొనేవాణ్ణి. నా ప్రపంచం నాన్నకు అర్థం కాదు అనుకొనేవాణ్ణి. అలాంటిది, ఇదేమిటి నేను నాన్న ప్రపంచంలోకి వచ్చేశానా!? ఆలోచించిన కొద్దీ నాకే ఆశ్చర్యంగానూ, సంభ్రమంగానూ ఉంది.

ఆబ్దికం రోజున భోజనాలయ్యాక కబుర్లు చెప్పుకొంటున్న సమయంలో మా ఆవిడ, నా కొడుకులిద్దరూ నా మీద మా అక్కయ్యకు ఫిర్యాదు చేశారు. మా స్నేహితులు కొందరు కొంటున్నారు కదా అని ఉప్పల్ దగ్గర నేను కూడా రెండు వందల గజాల స్థలం కొన్నాను. తీరా చూస్తే దాని పత్రాలు సరైనవి కావు. పాతికవేలు నష్టం. 'అన్నీ చూసుకోవద్దా?' అని మా ఆవిడ సాధిస్తోంది. 'నాన్నకు తొందరెక్కువ' అని మా పెద్దబ్బాయి, 'అవున'ని నా చిన్నకొడుకు, అంతా విన్న మా అక్కయ్య 'అదేమిట్రా?' అంది. నాకు రోషం వచ్చింది. 'ఏదో జరిగిపోయింది. ఇకనుంచి మీరెలా చెబితే అలాగే నడచుకొంటాను' అన్నాను.


'అదిగో, చూశారాండీ, మీ నాన్నగారు అలాగే అనేవారు' అంది అక్కయ్యతో మా ఆవిడ.

నేను మరోసారి ఉలిక్కిపడ్డాను. అవును, నాన్నగారు తను జరిపిన ఏ వ్యవహారమైనా సమస్య తెచ్చిపెట్టినప్పుడు, అందరూ నిలదీస్తున్నప్పుడు అచ్చంగా ఇలాగే అనేవారు. ఓసారి ఆయన ఉపన్యాసాలకు ఒంగోలు వెళ్ళి, అక్కడివాళ్ళు ఇచ్చిన వెయ్యి నూట పదహార్ల సత్కారంతో తిరిగి వచ్చారు. మరో రెండు రోజుల్లో దేవీ నవరాత్రులు ప్రారంభం. నాన్నగారు వస్తూ వస్తూ ఒక నంబూద్రి బ్రాహ్మణ యువకుణ్ణి వెంటబెట్టుకొని వచ్చారు. అతడు బి.ఏ. చదివేడట. పాకశాస్త్రంలో మంచి ప్రవీణుడట. తన ఉపన్యాసాలు విని తన మీద గురుభావం పెంచుకొన్నాడట. ఒంగోలులో తనున్నన్నిరోజులూ వెంటే ఉండి సేవలు చేశాడట. అతడు మంచి వంటవాడని తెలియగానే నవరాత్రుల్లో రామాయణ పారాయణ చేసి పదిమందికీ భోజనం పెట్టాలన్న ఆలోచన ఆయనకు కలిగిందట. ఈ మాటలు చెబుతూ వాళ్ళ అమ్మ తనతో మొదటిసారి రామాయణ పారాయణ చేయించి ఊరంతా భోజనాలు పెట్టించిన సంగతిని ఆయన ఎంతో తన్మయంగా గుర్తు చేసుకొన్నారు.

వింటున్న మా అమ్మ, మేము నిశ్చేష్టులమైపోయాం. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగులేవు. ఈయన తెచ్చిన వెయ్యి రూపాయలూ ఇలా ఖర్చు పెడతానంటున్నాడు! ఒక వెయ్యేమిటి, మరో రెండువేలైనా ఖర్చు తేలతాయి.

'వంటవాడు దొరికాడు కదా అని ఊరంతా సంతర్పణ చేస్తామండీ...' అంటూ మా అమ్మ అడ్డు చెప్పబోయేసరికి మా నాన్న ఎగిరిపడ్డారు. మా అమ్మ నుంచి వ్యతిరేకత వస్తుందని ముందే తెలుసు కనుక దబాయింపు అస్త్రాన్ని ప్రయోగించడానికి ఆయన ముందే సిద్ధమై ఉన్నారు. శేషం కోపేన పూరయేత్! 'అన్నీ ఆ రాముడే చూసుకొంటాడు. ఇది జరగవలసిందే!'నన్నారు ఖండితంగా. వెంటనే మా అందరికీ తలో పనీ పురమాయించేసి నాన్నగారు గాడిపొయ్యి తవ్వించే సన్నాహంలో మునిగిపోయారు.

తొమ్మిది రోజులూ ఉదయం రామాయణ పారాయణం, భోజనాలు అయిన తర్వాత కొంతసేపు విశ్రాంతి, ఆ తర్వాత నాలుగు గంటల నుంచి ప్రవచనం...అన్ని రోజులూ ప్రవచన సమయంలో నాన్నగారి విజృంభణ చూసి తీరవలసిందే. రామాయణ ప్రవచనం ఆయనకు కొట్టిన పిండి, అప్పటికి ఎన్ని పారాయణలు చేశారో, ఎన్ని ప్రవచనాలు చేశారో! ఆయన గాత్రం మృదుమధురంగా ఉండేది. శ్లోకం తనదైన ఒక పద్ధతిలో రాగయుక్తంగా చదివేవారు. కరుణరసార్ద్ర ఘట్టాలలో ఆయన ప్రవచనం మరింత మాధుర్యం ఒలికిపోయేది. అంతరార్థాలను, విశేషాలను అనేక కోణాలనుంచి ఆయన వ్యాఖ్యానించి చెబుతుంటే ఒక్కొక్క రోజున ఒక్క ఘట్టం కూడా పూర్తయ్యేది కాదు. పండితులు వాటిలోని స్వారస్యాన్ని అర్థం చేసుకొని ఆనందిస్తే, ఒక మాదిరి శ్రోతలు కథాగమనానికి



ఆయన గాత్రం మృదుమధురంగా ఉండేది.

శ్లోకం తనదైన ఒక పద్ధతిలో రాగయుక్తంగా చదివేవారు.

కరుణరసార్ద్ర ఘట్టాలలో ఆయన ప్రవచనం మరింత మాధుర్యం ఒలికిపోయేది.

చెవియొగ్గేవారు. అంతకంటె తక్కువస్థాయి శ్రోతలు ఆయన ప్రవచన శైలికి, రాగయుక్త పఠనానికి సమ్మోహితులయ్యేవారు.

మొత్తంమీద అన్నిరోజులూ ఇల్లు కిక్కిరిసిపోయింది. చివరిరోజున సంతర్పణ. చదివింపులు చదివించినవాళ్ళు చదివించారు. తొమ్మిది రోజులూ అయిపోయిన తర్వాత లెక్క చూసుకొంటే కిరాణాకొట్టులో వెయ్యిరూపాయల బాకీ తేలింది. ఈ లోపల నంబూద్రి బ్రాహ్మణుడు వంటింట్లో మా అమ్మ దాచుకొన్న వంద రూపాయలు తీసుకొని ఉడాయించాడు. ఆ తర్వాత, అత్యవసరమై తీసుకొని వెళ్ళానంటూ క్షమాపణ కోరుతూ ఉత్తరం. రాశాడు. అప్పటికి నాన్నగారి రామాయణ పారాయణ ఉత్సాహమంతా చల్లారింది. కిరాణాకొట్టుమనిషి వెయ్యి రూపాయల బాకీ గురించి ఒకటికి రెండుసార్లు అడిగేసరికి ఆయన ఎలాగా అని తలపట్టుకొన్నారు. తొమ్మిదిరోజులూ ఉగ్గబట్టుకొని ఉన్న మా అమ్మ అప్పుడిక కస్సున లేచింది. 'ముందూ వెనకా చూసుకోకుండా ఖర్చు పెట్టడం, తాహతులేని ఎత్తుల్ని ఎత్తుకోవడం. వద్దంటుంటే వినిపించుకొన్నారా? బాకీ ఎలా తీర్చుకొంటారో తీర్చుకోండి' అనేసి వంట పనిలో పడిపోయింది. ఇల్లంతా నిశ్శబ్దం. నాన్నగారు మాట్లాడలేదు. పిల్లిలా అయిపోయారు. అస్థిమితంగా కాస్సేపు అటూ ఇటూ తచ్చాడారు. అంతలో, 'బుర్ర వేడెక్కిపోయింది' అంటూ కొబ్బరినూనె తీసుకొని గుండుకు మర్దనా చేసుకోవడం ప్రారంభించారు. అమ్మలో బింకాన్ని తగ్గించి కదిలింపచేసే నాన్నగారి ఎత్తుగడలలో అది ఒకటి. అమ్మ కంగారుపడుతూ, వంటపని ఆపేసి నాన్నగారి దగ్గరకు వచ్చి, 'పోనీలెండి, బుర్రకు పట్టించుకోకండి. బాకీ ఎగ్గొడతామా? కొద్దిరోజులు ఆగమని చెబుదాం' అంటూ అనునయించింది. అంతలో, వేరేఊళ్లో ఉద్యోగం చేస్తున్న మా అన్నయ్య మా నాన్నపాలిట దేవుళ్ళా వచ్చాడు. నాన్న మొహం చాటంత అయింది. భోజనాలయ్యాక, అమ్మ సాధింపుల మధ్య విషయమంతా నాన్న అన్నయ్యకు చెప్పి, 'ఒరేయ్ ఈ గండం గట్టెక్కించు. ఇకనుంచి మీరెలా చెబితే అలాగే చేస్తాను. నా సంపాదనంతా మీ చేతికే ఇస్తాను. మీరే ఖర్చు పెట్టండి' అన్నారు. అప్పటికి అన్నయ్య తన దగ్గర ఉన్న అయిదొందలు ఇచ్చి, మిగతా అయిదొందలు తర్వాత పంపించాడు.

అవునేమో, నేను మా నాన్నలానే మారిపోయేనేమో!.... తలచుకొన్న కొద్దీ ఆశ్చర్యంతో తలమునకలయ్యాను. నేను కూర్చునే తీరులో, పడుకొనే పద్ధతిలో, నడకలో, హావభావాల్లో 'నన్ను' తొలగించుకొని నాన్ననే చూస్తున్నానా అనిపించసాగింది.


నాకు ఊహ తెలిసిన తర్వాత బాగా గుర్తుండిపోయిన నాన్నగారి గురించిన దృశ్యం ఒకటే. ఆయన గదిలో కింద కూర్చుని, ముఖంమీద కొట్టొచ్చినట్లు కనిపించే ఆలోచనా ముద్రతో, ఏక ధ్యానంతో రాసుకొంటూ ఉండేవారు. ఒక్కోసారి మంచం మీద అడ్డంగా కూర్చుని రాసుకొనేవారు. తెల్లవారుజామున కూడా ఆయన గదిలో దీపం వేసుకొని రాసుకొంటూ కనిపించేవారు. ఆయన గురించి నా తొలి జ్ఞాపకాలు ఇవే.

మా నాయనమ్మ ఆదేశంతో ఆయన చిన్నప్పటినుంచే భాగవత, రామాయణ పారాయణ, ప్రవచనం చేస్తుండేవారు. వేరే ఊళ్ళనుంచి కూడా ఆయనకు పురాణ ప్రవచనానికి, ఉపన్యాసాలకు ఆహ్వానాలు వచ్చేవి. తమిళనాడులో ఉన్న తన ఆధ్యాత్మిక గురువు పరమాచార్య దర్శనానికి తరచు వెడుతూ రోజుల తరబడి ఉండిపోయేవారు. ఇన్ని వ్యాపకాల మధ్య కూడా ఆయన చేసినంతటి సారస్వత సృజన ఒక జీవిత కాలంలో అసాధ్యమనిపిస్తుంది. ఒకే రంగానికి ఆయన ఎప్పుడూ కట్టుబడి లేరు. ఆయన ఆసక్తులూ, వ్యాసంగమూ బహుముఖంగా ఉండేవి. ఆయనలో చరిత్రపట్ల ఉత్సుకత, పరిశోధనా జిజ్ఞాస అపారంగా ఉండేవి. తన దీక్షాగురువు వద్ద భరద్వాజుని వైమానిక తంత్రం తాళపత్ర గ్రంథం చూసి దానిని ఎంతో ఓపికగా ఎత్తి రాసుకొన్నారు. పురాణాలపై ఆయన చాలా పరిశోధన చేశారు. పురాణాలలో చెప్పిన ద్వీపాల పేర్లను, సముద్రాల పేర్లను ఇప్పటి ఖండాలకూ, సముద్రాలకూ అన్వయించే ప్రయత్నం చేసేవారు. చంద్రమండలంలో జీవరాశి లేదని తెలిసినప్పుడు గ్రహాంతరాలలో జీవులు మనలాంటి రూపంలో, మనకు కనిపించే రూపంలో ఉండరనేవారు. చంద్రమండలంలో పితృదేవతలు ఉంటారనేవారు. నదులకు ఆనకట్టలు కట్టి కృత్రిమంగా ప్రవాహాన్ని నిరోధించడం వల్ల విపరీత పరిణామాలు ఉంటాయని పురాణాలలో రాసుందని ఉదహరించేవారు.

మా ఇంట్లో ఒక చెక్క బీరువా ఉండేది. అందులో ఎక్కువ భాగం సంస్కృత గ్రంథాలే. నేను ఆరో తరగతి చదువుకొంటున్నప్పుడు మొదటిసారిగా ఆ బీరువాలోంచి తీసి చదివిన పుస్తకం 'శ్రీకృష్ణ దేవరాయల చరిత్రము'. ఆ తర్వాత 'దొడ్డ రామాయణం'. పేరుకు తగినట్టు అది దొడ్డ పుస్తకమే. నేను నా కాల్పనికఆసక్తులను మా అమ్మతోనే పంచుకొనేవాణ్ణి. రామాయణ, భారత కథలలో నేనేమైనా సందేహాలు అడిగితే మా అమ్మ చెబుతుండేది. మా నాన్నగారి సారస్వత వ్యాసంగం నాకు అర్థమయ్యేది కాదు. ఆసక్తి కలిగించేది కాదు. మా ఇంటికి కవులు, పండితులు ఎవరైనా వచ్చినప్పుడు మాత్రం నాన్నగారికీ, వారికీ మధ్య జరిగే సంభాషణలను వింటుండేవాడిని.

నేను కాలేజీ చదువుకు వచ్చాక విభిన్న ప్రపంచంలోకి అడుగుపెట్టాను. శ్రీశ్రీ, మార్క్సిజం, నక్సల్బరీ ఉద్యమం, కథ,నవల, ఆధునిక సాహిత్య విమర్శ నా సాహిత్య చింతనను, ఆలోచనాసరళిని కమ్మేసుకొన్నాయి. నాన్నగారి భావజాల ప్రపంచం నుంచి నేను పూర్తిగా వేరుపడిపోయాననుకొన్నాను. ఆయనతో మాట్లాడడానికి నాకు విషయాలే కనిపించేవి కావు.

ఆయన ఎప్పటిలానే కావ్యాలు, శతకాలు రాసుకొంటూ, పురాణాలు అనువదిస్తూనే ఉండేవారు. నా కవితలు, కథలు, విమర్శలు... నా ప్రపంచంలో నేను ఉండేవాణ్ణి. స్నేహితులు, చర్చలు, సినిమాలు, నాటకాలు, సాహిత్య సభలు అర్ధరాత్రి తిరుగుళ్ళతో యవ్వనోత్సాహపు ఉరవడిలో పడి విపరీతంగా అలసిపోయేవరకు కొట్టుకుపోవడం.



ఈ సమయంలో నా నడవడి గురించి, భవిష్యత్తు గురించి నాన్నగారి భయాలు, ఆందోళనలు ఎలా ఉండేవో, అసలుండేవో కావో నాకు తెలియదు. నా ప్రపంచం నాన్నగారికి అర్థం కాదనే ఒక చులకనభావం నాలో నాన్నగారు మరణించేవరకూ ఉందేమో! కానీ, నా ప్రపంచం గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఆయనలో ఉండేదేమోనని నాకిప్పుడు ఆలోచిస్తే అనిపిస్తోంది.

**చదివిన ప్రతి పుస్తకం మీద తేదీ వేసి, 'ఇది చాలా మంచి పుస్తకం. దీనిని పూర్తిగా చదివితిని' అనో, 'ఈ పుస్తకం అద్భుతం. ఎన్నో కొత్త విషయాలు ఉన్నవి' అనో రాసి సంతకం చేసేవారు.**

అంతవరకు సాహిత్యానికి పరిమితమైన నేను కోశాంబిని చదవగానే అదిరిపడ్డాను. కొన్నిరోజుల పాటు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యాను. నాకు తెలియకుండానే నాలో పరిశోధనా జిజ్ఞాస మేలుకొంది. ఒకసారి నాకొక సందేహం వచ్చింది. జ్యేష్ఠుడికే రాజ్యాధికారం కదా, మహాభారతంలో పలు ఉదంతాలలో చిన్నకొడుకే ఎందుకు రాజయ్యాడు? మహాభారతంలోనూ, రామాయణంలోనూ రాజ్యాధికారం అన్నదా, తమ్ముడిదా అన్న వివాదమే ప్రధానాంశం ఎందుకయింది?

ఇది నాన్నగారి ప్రపంచానికి సంబంధించిన విషయం కనుక ఒకరోజున ఆయనను అడిగాను. ఆయన ఆ ప్రశ్న విని విస్మయంగా, ప్రశంసగా, సాలోచనగా నా వైపు చూశారు. క్షణకాలం అలా ఉండిపోయి, 'ఈ సందేహం నాకెప్పుడూ కలగలేదురా' అన్నారు. ఆయన ఆ మాట అంటున్నప్పుడు ఆయనలోని పరిశోధకుడు తనకా సందేహం రానందుకు నొచ్చుకొంటున్నట్టు నాకు అనిపించింది.

'జ్యేష్ఠుడికే రాజ్యాధికారం అన్నది నియమం. ఎక్కడైనా చిన్న కొడుకు రాజయితే అది మినహాయింపు' అన్నారు ఎట్టకేలకు.

'చిన్నకొడుకు రాజైన ఉదాహరణలు లెక్కకు మించి ఉన్నప్పుడు అది మినహాయింపు ఎందుకు అవుతుంది? అదే ఎందుకు నియయం కాకూడదు? పైగా మహాభారతంలోనూ, రామాయణంలోనూ ఈ వివాదమూ, ఇందుకు సంబంధించిన ఘర్షణా కథలో ప్రధానాంశం కూడా అవుతున్నాయి' అన్నాను.

ఆయన మళ్ళీ నావైపు విస్మయంగా చూశారు. కాస్సేపు ఆలోచనలో పడిపోయారు. తర్వాత, 'వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి మహాభారత తత్త్వకథనం ఒకసారి చూడు. అందులో సమాధానం దొరకచ్చు' అన్నారు.

నేను నవ్వుకొన్నాను. ఆ పుస్తకంలో ఈ ప్రశ్నకు సమాధానం దొరకదని నాకు నిశ్చయంగా అనిపించింది. ఎందుకంటే, సంప్రదాయ పండితులకు ఈ సందేహం కలిగే అవకాశం లేదు. ఒకవేళ కలిగినా సాంప్రదాయికమైన వివరణ ఏదో ఇచ్చి సరిపెడతారు. అయితే నేనీమాట నాన్నగారితో అనలేదు.

ఆ తర్వాత కొన్నిరోజులకు, రొమీలా థాపర్ రాసిన 'జినియాలజీ ఆఫ్ మహాభారతా'లో, ఫ్రేజర్ రాసిన 'గోల్డెన్ బౌ'లో నాకీ ప్రశ్నకు జవాబు దొరికింది. మాతృస్వామ్యంలో చిన్నకొడుకుదే రాజ్యాధికారం. అంటే, రామాయణ, భారత గాథలు మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యానికి మళ్ళే దశకు చెందినవై ఉండాలి.

నేనా ప్రశ్న వేసినప్పుడు ఆయన ముఖంలో కనిపించిన ఆ విస్మయం, గంభీరమైన ఆలోచనా ముద్ర ఇప్పటికీ నా జ్ఞాపకాలను వెంటాడుతూనే ఉన్నాయి. ఆయనలోని జిజ్ఞాస ఆనాటికీ సజీవంగానే ఉందేమో, నూతన విజ్ఞాన ప్రపంచంలోకి, నూతన అనుభవంలోకి అడుగుపెట్టడానికి అప్పటికీ ఆయన ఆరాటపడుతూనే ఉన్నారేమో. ఒక్కచోటే ఆగిపోకుండా, కాలంతో పాటు ప్రవహించడానికి సిద్ధంగా ఉన్నారేమో. కానీ వయస్సు, ఓపిక ఆయన జిజ్ఞాసకు కనిపించని సంకెళ్ళు వేస్తున్నట్టున్నాయి. విజ్ఞానం కూడా తనకు బాగా తెలిసిన సంస్కృత ప్రపంచం నుంచి వేరుపడి ఆంగ్ల ప్రపంచంలోకి మారడం కూడా ఆయనకొక అశక్తత. అదీగాక తాను జీవితాంతమూ సాగించిన సారస్వత వ్యాసంగంలో కూడా చేయవలసింది ఎంతో మిగిలిపోయింది.

ఆయన ఆలోచనల లోతు తళుక్కున మెరిసి నన్ను దిగ్భ్రమపరచిన మరొక ఉదంతం నాకు జ్ఞాపకం వస్తోంది. 'భగవంతుడి విగ్రహంముందో, పటం ముందో కూర్చుని రోజూ పూజ చేయడం వల్ల జపం చేయడం వల్ల భక్తుని కోరిక తీరడం, అతనికి మేలు జరగడం ఎలా సంభవిస్తాయి? ఏమిటి దీనివెనుక ఉన్న హేతుబద్ధత?' అని నేను అడిగాను. ఆయన క్షణకాలం ఆలోచించి, 'భగవంతుడి విగ్రహంలోనూ, పటంలోనూ ఏమీ విశేషం లేదు. పూజవల్లనే భక్తుడికి మేలు జరగదు. విశేషమల్లా భక్తునిలోనే ఉంది. భక్తి వల్ల అహంకారం నశించి అంతఃకరణ పరిశుద్ధమవుతుంది. పరిశుద్ధమైన అంతఃకరణలో జగత్తు స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. అటువంటి వ్యక్తి తలపెట్టినవి నెరవేర్చడానికి ప్రకృతి కూడా సాయపడుతుంది' అన్నారు.

ఆయన తన జీవిత కాలంలో చివరి రెండేళ్ళు మినహా మిగిలిన కాలమంతా రచనా వ్యాసంగం కొనసాగిస్తూనే ఉన్నారు. అధ్యయనం చేస్తూనే ఉన్నారు. నా బుక్‌షెల్ఫ్‌లో ఆంగ్ల గ్రంథాలతో పాటు ఎక్కువగా ఆధునిక సాహిత్య గ్రంథాలు, నవలలు, కథాసంపుటాలు, చరిత్ర పుస్తకాలే తప్ప ఆయనకు పనికొచ్చేవి పెద్దగా ఉండేవి కావు. అవే తీసి ఆయన చదువుతూ ఉండేవారు. ఆయన చదవదగిన పుస్తకం అనుకొన్నప్పుడు నేనే ఆయనకు ఇచ్చి చదవమనేవాణ్ణి. అలా రాంభట్ల కృష్ణమూర్తి రాసిన 'జనకథ', 'వేదభూమి' ఆయన చేత చదివించాను.

చదివిన ప్రతి పుస్తకం మీద తేదీ వేసి, 'ఇది చాలా మంచి పుస్తకం. దీనిని పూర్తిగా చదివితిని' అనో, 'ఈ పుస్తకం అద్భుతం. ఎన్నో కొత్త విషయాలు ఉన్నవి' అనో రాసి సంతకం చేసేవారు. ఒక్కొక్క పుస్తకం మీద సుదీర్ఘమైన అభిప్రాయం రాసేవారు. నేను తొలిరోజుల్లో రాసి అచ్చు వేయించిన ఒక దీర్ఘవచన కవిత పుస్తకం ఆయనకు చూపించలేదు. ఆయనే ఒకసారి నాకు తెలియకుండా ఆ పుస్తకం సంపాదించి చదివి, 'ఇది అద్భుతం. నాకే అందని లోతులు ఈ కవిత్వంలో ఉన్నవి' అంటూ అభిప్రాయం రాశారు.

ఇప్పుడాలోచిస్తే అనిపిస్తోంది... ఏ ఇరుకులోనూ ఆయన ఎప్పుడూ ఇమిడిపోలేదు. ఏ భావజాలానికీ బానిస కాలేదు. ఏ మతాన్ని, జాతిని ద్వేషించిన తృణీకరించిన ఉదాహరణ ఆయన జీవితంలో ఒక్కటి కూడా లేదు. ఎల్లలెరుగని వైశాల్యం ఆయన జీవలక్షణమనిపిస్తుంది. ఎన్నో ఉపనదుల్ని, వాగుల్ని వంకల్ని తనలో కలుపుకొని అఖండంగా, విశాలంగా ప్రవహించే మా ఊరిపక్క గోదావరిలాంటి వ్యక్తిత్వం ఆయనదనిపిస్తుంది. గగనమంతటా విరివిగా పరచుకొన్న సజల మేఘంలా నా ఊహల్ని ఆయన ఆక్రమించుకొంటున్నారు.

ఊహించినకొద్దీ నాన్న కొత్తగా కనిపిస్తున్నారు. విశాలంగా, సమున్నతంగా భాసిస్తున్నారు. ఇంతకాలం ఆయననుంచి వేరుపడి, ఆయనకు దూరంగా వెళ్ళిపోతున్నానని భ్రమించిన నేను ఇప్పుడా విస్తృతిలో చిన్న భాగంగా కలిసిపోతున్నాననిపిస్తోంది. నాన్నే నేనయ్యాననిపిస్తోంది. నా ఆసక్తులు కూడా విచిత్రంగా సాహిత్యం నుంచి చరిత్రలోకి, సోషల్ యాంత్రపాలజీలోకి, చివరకు నాన్న వారసత్వమైన పురాణేతిహాసాలలోకి విస్తరించడం తలచుకొంటే మరింత ఆశ్చర్యం కలుగుతోంది. నా వ్యాసంగం కూడా నాన్న వ్యాసంగంలానే బహుమార్గాలు పడుతోంది. నాన్న వారసత్వాన్నే మరో రూపంలో నేను పొడిగిస్తున్నానా? నాన్న మధించిన వాఙ్మయానికే కొత్తకోణాలు తొడుగుతున్నానా? నాన్నకు నేను పొడిగింపు అవుతున్నానా? నాన్నే నేను అవుతున్నానా?

** ** **

పుస్తక పఠనం అలవాటు నాకు చిన్నప్పటినుంచీ ఉండేది. మా అబ్బాయిల వయసు వచ్చేసరికి ఎన్ని పుస్తకాలు చదివుంటానో! గంటల కొద్దీ

## ఇరవై సంవత్సరాలు



రాణి: నమస్తే ఆంటీ!

రఘునాథ్: మీ మమ్మీని పట్టుకుని ఆంటీ అంటావేమిటి?

రాణి అక్కడే వున్న ఆంటీని ఒకసారి పరిశీలనగా చూసి "సారీ మమ్మీ! ఇరవై సంవత్స రాల నుంచి హాస్టల్‌లో వుండటంతో గుర్తుపట్టలేకపోయాను" అంది.

---

సమయాన్ని లైబ్రరీలోనే గడిపేవాణ్ణి. కానీ మా అబ్బాయిలు, టెక్ట్స్ బుక్కులు తప్ప వేరే పుస్తకం చదువుతుండగా నేనెప్పుడూ చూడలేదు. మా నాన్న నుంచి నాకు వచ్చిన అధ్యయన వారసత్వం నా పిల్లలకు రాక పోవడం నాకు ఆశ్చర్యంగానూ, బాధగానూ ఉండేది. ఇళ్ళల్లోకి టివి అడుగుపెట్టడం కూడా ఇందుకొక ప్రధాన కారణమనిపించింది. అందు లోనూ మా పెద్దవాడు ఎప్పుడూ టీవీ ముందే ఉండేవాడు. 'ఒరేయ్, అస్తమానూ ఆ టీవీ చూడకపోతే ఏదైనా మంచి పుస్తకం చదువుకోకూడదురా. పుస్తకాలు చదవక మీరు చాలా కోల్పోతున్నారు. ఆ విషయం మీకు తెలియడం లేదు. ఏ సినిమాకూ సాటిరాని అద్భుత ప్రపంచాలను పుస్తకాల్లో చూడొచ్చు. మీరు ఆ అనుభవాన్ని మిస్ అవుతున్నారు' అని ఎప్పుడైనా మందలించేవాణ్ణి.

'పుస్తకాల్లో ఉండే నాలెడ్జి టీవీలోనే దొరుకుతున్నప్పుడు పుస్తకాలు చదవడం ఎందుకు?' అనేవాడు మా పెద్దవాడు. అందులో కొంత నిజం ఉన్నట్టు నాకూ తోచేది కానీ, పుస్తక పఠనం కలిగించే అనుభూతి వేరని వాదించేవాణ్ణి. మొత్తానికి నాన్న బీరువాలోంచి నేను పుస్తకాలు తీసి చదువుకొన్నట్టుగా, నా షెల్ఫ్‌లోంచి నా పిల్లలెవరూ పుస్తకాలు తీసి చదవకపోవడం చూసి మా కుటుంబంలో అధ్యయన వారసత్వం ఇక ముగిసినట్లేనా అనిపించి బాధ కలిగేది.

నా ప్రపంచం నుంచి నా పిల్లల ప్రపంచం వేరయినట్లు నాకు క్రమంగా మరింత గాఢంగా అనిపించసాగింది. నాకు బోధపడని అత్యాధునిక సాంకేతిక విషయాలు వాళ్ళు ఇట్టే గ్రహించేవారు. అస్తమానూ కంప్యూటర్ ముందు కూర్చుని వాళ్ళు గేమ్స్ ఆడుకొంటుంటే చూస్తున్నప్పుడు, వీళ్ళకు చరిత్ర, సాహిత్యం, రాజకీయాలు, ఉద్యమాల వంటివి ఏవైనా పడతాయా, సమాజం గురించి వీళ్ళు ఎప్పుడైనా ఆలోచన చేస్తారా, కరుణ, సానుభూతి, మంచితనం, మానవత్వం వంటి మానవీయ స్పందనలకు వీళ్ళు దూరమవుతున్నారా, స్వార్థపరులవుతున్నారా, కుంచించుకుపోతున్నారా అన్న విచికిత్స నాలో కలుగుతూ ఉండేది.

భోజనాల దగ్గర మా ఆవిడకు పెద్దసమస్యగా ఉంటుంది. నాలానే మా పెద్దవాడికి కూడా రుచులు కావాలి. అన్నానికి కూర్చున్నప్పుడల్లా సణుగుతూ ఉంటాడు. 'భోజనంలో రుచులు' అన్న భావనే మా ఆవిడకు సరిపడదు. అదో నేరంగా చూస్తుంది. వాళ్ళ పుట్టింట్లో ఏది ఎలా వండిపెట్టి నా వంక పెట్టకుండా తృప్తిగా తింటారని గొప్పగా చెప్పుకొంటూ ఉంటుంది. ఎలా ఉన్నా తినేవాళ్ళలో తనతో పాటు మా రెండో అబ్బాయిని కూడా చేర్చుకొని వాణ్ణి పొగుడుతూ ఉండేది.

మా రెండోవాడు అప్పటికి వేరే ఊళ్ళో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. చదువైపోయి తిరిగొచ్చాక, వాడిమీద అంతవరకూ మా ఆవిడకు ఉన్న ఊహను తలకిందులు చేసేశాడు. వాడికి కూడా ఇప్పుడు రుచులు కావలసివస్తున్నాయి. భోజనం దగ్గర రోజూ ఒకటే సాధింపు, ఒకటే వాదన. పాపం మా ఆవిడ ఒంటరిదైపోయింది. ఒక్కోసారి వాడే వంటకు దిగేవాడు. మా నాన్నగారు కూడా అంతే. మా అమ్మ పుట్టింటికి వెడితే ఆయనకు ఆటవిడుపుగా ఉండేది. ఆయనే వంటకు పూనుకొని రకరకాల రుచుల మేళవింపుతో వంటకాలు చేస్తూ చాలా హడావుడి చేసేవారు.


రానురాను మా రెండోవాడు మా ఆవిడకు పెద్ద సమస్యగానే మారాడు. వాడున్నప్పుడు ఇంట్లో ఏ వస్తువూ ఉన్నచోట ఉండదు. వాడికి ప్రత్యేకంగా ఒక పెట్టె ఉంది. అందులో అన్నీ ఎలక్ట్రిక్ వైర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పనిముట్లే. వాడు అవన్నీ బయటికి తీసి ఏదో సాధనం తయారీలో మునిగిపోతాడు. ఒక్కోసారి అవన్నీ అలాగే ఉంచేసి బయటికి వెళ్ళిపోతాడు. వాడొకసారి రేడియో ట్రాన్స్‌మిషన్ వ్యవస్థనంతటినీ తయారుచేసి మా చుట్టుపక్కల ఇళ్ళల్లోని రేడియోలలోకి మా యింటినుంచే సినిమా పాటల్ని ప్రసారం చేశాడు. వాడు తయారు చేసిన పోలీస్ అలార్మింగ్ యూనిట్‌కు ఇంజనీరింగ్ ఫెయిర్‌లో అవార్డు కూడా వచ్చింది. వీటన్నింటికీ బాగా డబ్బు ఖర్చవుతుండడంతో మా ఆవిడకీ, వాడికీ రోజూ వాగ్యుద్ధమే.

వాడివన్నీ ఖరీదైన హాబీలు. కొన్నాళ్ళు ఫొటోగ్రఫీ సాధన చేశాడు. గురువారాల్లో జుమారత్ బజార్‌కు వెళ్ళి యాంటిక్స్ కొనుక్కొచ్చి వాటిని తనే రిపేరు చేసి పని చేయిస్తూ ఉంటాడు. వాడి మిత్రబృందం కూడా చాలా పెద్దది. ఒక్కోరోజున ఆకస్మాత్తుగా ముగ్గురు, నలుగురిని భోజనానికి వెంటబెట్టుకొని వచ్చి మా ఆవిడ సహనానికి పెద్ద పరీక్ష పెడుతుంటాడు. మా నాన్న కూడా అలాగే ఎవరెవరినో హఠాత్తుగా భోజనానికి వెంటబెట్టుకొని వచ్చేవారు. మా వాడు స్నేహితులతో కలసి ఒక్కోసారి అరకులోయ అనీ, శ్రీశైలమనీ విహారయాత్రలకు వెళ్ళిపోతూ ఉంటాడు. వాడు కాలేజీ చదువు నాలుగేళ్ళలో నల్లమల అడవులకు వెళ్ళి ఎటువంటి సాహసాలు చేసినదీ, శ్రీశైలం వెళ్ళి కృష్ణానది మీద బోటు ప్రయాణం చేసి అక్కమహాదేవి గుహలకు వెళ్ళినప్పటి అనుభవాల గురించీ ఇప్పుడు వాడు కథలు కథలుగా చెబుతుంటే మాకు ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది.

వాడిలో ఉరకలేస్తున్న సృజనాత్మక ఉత్సాహాన్ని, అది వాడి కళ్ళల్లో తెచ్చిపెట్టే మెరుపును చూసినప్పుడు, వాడు నా ప్రపంచానికి భిన్నమైన ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడనిపించినప్పుడు, నేను మా నాన్న ప్రపంచం నుంచి వేరుపడ్డాననుకొన్న నా యవ్వనారంభపు తొలిరోజులు గుర్తుకొస్తాయి.

వాడు కాలేజీలో ఉన్నప్పుడు ఒకరోజు అర్ధరాత్రి ఫోన్ చేశాడు. వాడి కంఠం దుఃఖంతో పూడుకుపోతోంది. వాడి జూనియర్ ఒకతను వర్షపు నీటిలో తడిసిన లైవ్‌వైర్‌ను తాకి చనిపోయాడట. అది నావల్లే జరిగిందంటూ వాడు బావురుమన్నాడు. ఆ కుర్రవాడు మొదట తనకోసం రూముకు వస్తే తను లేడట. దాంతో మరో మిత్రుడి రూముకు వెళితే ఈ ప్రమాదం జరిగిందట. తను రూములో ఉంటే ఇలా జరిగుండేది కాదని మా వాడి పరితాపం, మేమెలాగో వాణ్ణి సముదాయించాం. ఆసుపత్రినుంచే ఫోన్ చేస్తున్నాననీ, పోస్టుమార్టం అవసరం లేకుండా, పోలీసులనీ, డాక్టర్లనీ తమందరం బతిమాలి ఎలాగో ఒప్పించామనీ వాడు చెప్పాడు. ఆ కుర్రవాణ్ణి నేను ఎన్నడూ చూడకపోయినా ఆ విషాదమే నన్ను మూడు నాలుగు రోజులపాటు వెంటాడి బాధించింది.

ఇంకోసారి వాడు ఇంటికొచ్చి స్నేహితుణ్ణి వెంటబెట్టుకొని ఉస్మానియా ఆసుపత్రి చుట్టూ తిరగడం ప్రారంభించాడు. వికారాబాద్‌లో వాడి స్నేహితుడికి తెలిసిన ఒక కుర్రాడికి బ్లడ్ క్యాన్సరట. అతనికి చదువుకోవాలని కోరిక, కానీ ఆర్థికస్తోమత లేకపోవడంతో కులవృత్తి చేసుకొంటున్నాడట. ఇప్పుడతనికి ఈ ప్రమాదకరమైన రోగం. ఈ విషయం చెప్పి మా వాడు కన్నీళ్ళపర్యంతమయ్యాడు. ఆ కుర్రవాడి వైద్యం, మందులు, డాక్టర్లతో మాట్లాడడం- ఇవన్నీ మా వాడూ, వాడి స్నేహితుడే. వైద్యం ఖర్చుకోసం ఇద్దరూ కలసి కాలేజీలో విద్యార్థుల నుంచి, లెక్చరర్ల నుంచి డెబ్బయి వేల రూపాయలు సేకరించి ఇచ్చారు. కొన్ని రోజులపాటు ఇందులోనే మా వాడు తలమునకలయ్యాడు.



**నేను ఆపివేసిన చోటు నుంచి, మా నాన్న వారసత్వాన్ని, వాడి నాన్న వారసత్వాన్ని వాడు మరింత ముందుకు తీసుకువెడతాడు.**

(మిగతా 42వ పేజీలో)

# మా నాన్న నేను మా అబ్బాయి

(21వ పేజీ తరువాయి)

ఓ రోజు, 'నేను బతుకుతానా?' అని పాండు ఎంతో ఆశగా అడిగా'డని చెబుతూ మా వాడు కంటతడి పెట్టుకొన్నాడు. ఇంకో రోజున, 'పాండు చని పోయాడు' అన్న కబురు చెప్పాడు. అప్పుడు వాడి ముఖం చాలా గంభీరంగా ఉంది. శూన్యంలోకి చూస్తున్నాడు. చావును అతిదగ్గరగాచూసి చలించిపోయిన బోధిసత్త్వుడిలా ఇరవై ఏళ్ళకే వాడి ముఖంలో లోతైన వైరాగ్యభావన గడ్డకట్టు కొంటున్న ఛాయలను పోల్చుకొని నా పితృ హృదయం కలవరపడింది. నా కళ్ళ ముందు పెరిగిన వాడి ముఖంలో అనివార్యమైన జీవిత చరమసత్యం గురిం చిన ఎరుకను చూడడం నాకు కొత్తగానూ, ఆందోళనకరంగానూ అనిపించింది. పాండును కూడా నేనెప్పుడూ చూడకపోయినా, మా వాడితో నా సహానుభూతి వల్ల అతని మరణం నన్నూ చలింపజేసింది.

కాలేజీలో చదువుకొంటున్నప్పుడే వాడొక రోజున ఏదో జాతీయదినోత్సవం సందర్భంగా తను చేసిన ప్రసంగ పాఠాన్ని నాకు చదివి వినిపించడం ప్రారం భించాడు. నేను ఉలిక్కిపడ్డాను. ఆశ్చర్యంగా వింటూ ఉండిపోయాను. వాడి ఇంగ్లీష్ ఎక్స్‌ప్రెషన్ మరింత ఆశ్చర్యం గొలిపింది. వాడు పదాలను, ఆలోచ నలను పొదిగిన తీరులో సాహిత్య వారసత్వం లీలగా కనిపించి ఆలోచనలో పడ్డాను. వీడు నా ప్రపంచంలోకి రావడం లేదుకదా!

ఒకసారి వాడేదో ఇంగ్లీషులో పల్ప్ ఫిక్షన్ చదువుతుంటే చూశాను. తీరాచూస్తే వాడిదగ్గర అటువంటి పుస్తకాలు మరికొన్ని కనిపించాయి. వాడిలో పఠనాసక్తి పెరుగుతోందనుకొని ఏదో తెలియని సంతృప్తికి లోనయ్యాను.


ఒకరోజున వాడికి 'ది ఓల్డ్‌మాన్ అండ్‌ది సీ' ఇచ్చి, ఇది చదివి చూడు అన్నాను. వాడది చదివేసి చాలా థ్రిల్లింగ్‌గా ఉందన్నాడు. నా దగ్గర ఉన్న ఉత్తమ సాహిత్యం వాడిచేత చదివించాలన్న ఉత్సాహం క్షణకాలం కలిగింది. అంతలోనే, వాణ్ణి నా ప్రపంచంలోకి తీసుకొస్తే, వాడి కెరీర్ ఏమవుతుందోనన్న జంకు కలిగి అక్కడితో ఊరుకొన్నాను. కానీ, క్రమంగా వాడి బెడ్‌మీద, దిండు దగ్గర నా బుక్‌షెల్ఫ్‌లోని చెహోవ్, గోర్కీ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ది గ్రేటెస్ట్ వరల్డ్ స్టోరీస్ కలెక్షన్.... ఒక్కొక్కటే కనిపించడం ప్రారంభించాయి.

ఒక రోజున, టివిలో ప్రశ్నలకు లంచం తీసుకొన్న ఎంపిల గురించి చూస్తూ, ఉన్నట్టుండి వాడు, '...నక్సలైట్స్ ఆర్ రైట్' అన్నాడు ఒత్తి పలుకుతూ. ఎంతో ఆవేశాన్ని అణచుకొంటున్నట్టు కనిపించాడు.

సందేహం లేదు, వీడు ప్రపంచంలోకి వస్తున్నాడు. నా ప్రపంచంలోకి వస్తు న్నాడు. కంప్యూటర్ తరం గురించి ఒకప్పటి నా అంచనాలను, ఊహలను వీడు తలకిందులు చేస్తున్నాడు. వీడు స్వార్థపరుడు కావడం లేదు. తనచుట్టూ ఉన్న బాధలకు, దుఃఖాలకు స్పందిస్తున్నాడు. అన్యాయాలను, అక్రమాలను చూసి ఆవేశ పడుతున్నాడు. ప్రకృతిని, అందాలను చూసి పరవశిస్తున్నాడు. ప్రపంచాన్ని, ప్రపంచంలోని ప్రతి కోణాన్ని వినూత్న అవగాహనల వెలుగులో దర్శింప చేస్తున్న ఉత్సుకత వాడికళ్ళల్లో విడుపులేని మెరుపుతీవల్ని పరుస్తోంది. వాడు తనదైన కొత్త ప్రపంచాన్ని నిర్మించుకొంటున్నాడు. మా నాన్నలానే, నాలానే వాడి సృజనాత్మక ఆసక్తులు అనేకదారులుగా చీలిపోతున్నాయి. కెరీర్‌కు, ఇతరే తర ఆసక్తులకు మధ్య సర్దుబాటు చేసుకోలేక సతమతమవుతున్నాడు. నాకూ, మా ఆవిడకీ మధ్య అప్పుడప్పుడు టెన్షన్ పెంచుతున్నాడు.

ఒకవైపు జీఆర్ఇకి ప్రిపేరవుతూ, పరీక్ష దగ్గరకు వస్తున్నా పొద్దుటే తన చుట్టూ సామగ్రినంతటనీ పోగేసుకొని మా ఆవిడ చివాట్లను పట్టించుకోకుండా ఏక ధ్యానంతో ఏదో ఎలక్ట్రానిక్ ఇనొవేషన్‌లో మునిగిపోతున్నాడు.

వాడు త్వరలోనే ఏ ఖండాంతరాలకో సాగిపోతాడు. ప్రపంచీకరణ తరంలో భాగంగా సరికొత్త అనుభవాలను అందుకొంటాడు. కొత్త కొత్త ప్రపంచాలనూ, సమాజాలనూ చూస్తాడు. సరికొత్త భాషలు, అలవాట్లు నేర్చుకొంటాడు. కొత్త సమస్యలను, సవాళ్ళను ఎదుర్కొంటాడు. అయినా నా యింటి సారస్వత మూలధనం వాడిలో పదిలంగానే ఉంటుంది. వాడిలో ఉన్న మా నాన్న, నేను వాడితోపాటే కాలాంతరాలలోకి, ఖండాంతరాలలోకి ప్రవహిస్తాం. మా నాన్న లోనూ, నాలోనూ ఉన్న సృజనాత్మక దాహం వాడిమీదుగా కొత్త వెలుగులను, వికాసాలనూ, వైవిధ్యాలను సంతరించుకొంటుంది. స్థలకాలాలను జయించి తరం వెంట తరం అవిచ్ఛిన్నమవుతుంది. వాడు కూడా రేపు నాలానే నాన్న ప్రపంచం లోకి అడుగుపెడతాడు. వాడే నాన్న అవుతాడు. నేను ఆపి వేసిన చోటు నుంచి, మా నాన్న వారసత్వాన్ని, వాడి నాన్న వారసత్వాన్ని వాడు మరింత ముందుకు తీసుకు వెడతాడు. ●




## పౌరాణిక పద్యాలు వినిపిస్తూ!


చేరాలు

నాకిప్పుడు 70 సంవత్సరాల వయసు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా 35 ఏళ్లు పనిచేసి రిటైరయ్యాను. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. రిటైరై నప్పట్నించీ ఆధ్యాత్మిక చింతనను కొనసాగిస్తున్నాను. పాండవోద్యోగం, జంధ్యాల పాపయ్య శాస్త్రి రాసిన పద్యాలను ప్రజలకు వినిపిస్తున్నాను. భగవద్గీత పారాయణం చేస్తున్నాను. నాటకాలు వేసిన అనుభవం నాకుంది. కృష్ణరాయబారం, పల్లెపడచు, వంటి నాటకాలలో పలు పాత్రలు పోషించాను. యువకులు ఉద్యోగాలలో స్థిరపడి తల్లిదండ్రుల పోషణతో పేదవారి పట్ల ప్రేమను చూపాలి.

*-డి. చేరాలు, ప్రశాంతనగర్, ఖాజీపేట్, వరంగల్ జిల్లా*

## గీతా పాటలను గానం చేయిస్తూ!


సాయినాథరావు

హైస్కూలు హెడ్మాస్టర్‌గా, మండల విద్యాధికారిగా 33 సంవత్సరాలు పనిచేసి గత సంవత్సరం రిటైర్ అయ్యాను. రచనాసక్తితో భగవద్గీతపై పాటలు రాస్తున్నాను. గీతా మంది రాలలో ఆసక్తిగల భక్తులచేత ఆ పాటలను గానం చేయిస్తున్నాను కూడా. తీరిక సమయాలలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ పాల్గొంటున్నాను. విద్య, ఉపాధి, వికాస రంగాలలో భావి పౌరులకు ఉచిత సలహాలు ఇస్తూ తోచినమేర సేవా, సహకారాలు అందిస్తున్నాను. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ నిజాయితీగా పౌరుల బాధ్యతలను పిల్లలకు తెలియజెప్పాలి.

*-టి.వి.సాయినాథరావు, మదనపల్లి*

## ఇప్పుడు మీరేం చేస్తున్నారు?

మీరు చేసే పనులు మీ చుట్టూ ఉన్నవారికి ఏమైనా మేలు చేస్తున్నాయా? పదిమందికి తోడ్పడే విధంగా మీరు కాలం గడుపుతున్నారా? ఇలాంటి పనుల్లోనే ఆనందాన్ని వెదుక్కుంటున్నారా? 'జీవనసంధ్య'లోనైనా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న సంతృప్తి మీకుందా? అయితే ఇప్పుడు మీరు ఏం చేస్తున్నారో వివరంగా మాకు రాసి పంపించండి. మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు, మీ అనుభవాలు వృద్ధాప్యంలో ఉన్న ఇతరులకి స్ఫూర్తిదాయకంగానూ ఉంటాయి. వృద్ధాప్యాన్ని భారంగా, ఇతరులకు బరువుగా కాకుండా సృజనాత్మకంగా ఎలా గడపాలో తెలియజేస్తాయి. అలాగే, ఇప్పుడు మీరు ఏం చేస్తున్నారో కూడా ఈ శీర్షికకి రాసి పంపించండి. రిటైరయిన లేదా 58 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు, పురుషులు ఈ శీర్షికలో పాల్గొనవచ్చు. మీ పాస్‌పోర్ట్ సైజు ఫోటో పంపడం మరిచిపోకండి.

మా చిరునామా: జీవన సంధ్య, **ఆదివారం వార్త,**
ఎడిటర్, 'వార్త' దినపత్రిక, లోయర్ ట్యాంక్‌బండ్,
హైదరాబాద్-**500 080**